క్లుప్తంగా

మాదకద్రవ్యాలకు బానిస కావద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివకుమారి

సింగరాయకొండ: మాదకద్రవ్యాలకు యువత బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి విద్యార్థులకు సూచించారు. స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం గంజాయి వంటి మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. ఎక్సైజ్ ఎస్సై టి.రాజశేఖర్, ప్రిన్సిపాల్ సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మాలల మహాగర్జన కరపత్రాల పంపిణీ

పామూరు: గుంటూరులో ఈ నెల 15న జరిగే మాలల మహాగర్జనను జయప్రదం చేయాలని మాలల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి శాంతరాజు, వర్గీకరణ పోరాటసమితి అధ్యక్షుడు కె.బాలబాదుర్ల అన్నారు. మండలంలోని నుచ్చుపాద, అయ్యవారిపల్లె, బొట్లగూడూరు, ఇనిమెర్ల, గోపాలపురం, మోత్రావులపాడు, కంబాలదిన్నె గ్రామాల్లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి కన్వీనర్ కోటనీడి బాలు, సామాజిక కార్యకర్త జొన్నలగడ్డ గోవిందయ్య ఆధ్వర్యంలో మహాగర్జన విజయవంతం కోరుతూ ప్రచార కరపత్రాలను పంపిణీచేశారు

సమావేశానికి భారీగా తరలిరండి

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఈ నెల 12న స్థానిక పవిత్ర కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సమావేశానికి ఆరు మండలాల్లోని నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరవుతారన్నారు.


చదువుకు మించిన ఆయుధం లేదు



వేడుకల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు

పొన్నలూరు: చదువుకు మించిన ఆయుధం లేదని అందుకనే ప్రతి విద్యార్థి లక్ష్యంతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కళాశాల 24వ వార్షికోత్సవ, సీనియర్ ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వ్యక్తి అభివృద్ధికి చదువు ఒక ఆయుధమని. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు తమలోని వ్యక్తిగత కళా నైపుణ్యాలను వెలికితీసి జీవితానికి చక్కటి మార్గాన్ని ఏర్పర్చు కోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఎంఈఓలు రవిచంద్రబాబు, హరిబాబు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ముళ్ళమూరి వెంకటేశ్వర్లు, మండవ ప్రసాద్ అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెప్పుల దుకాణం దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

టంగుటూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెప్పుల దుకాణం దగ్ధమైంది. ఈ సంఘటన స్థానిక స్టేట్‌బ్యాంకు పక్కన మంగళవారం జరిగింది. ఫైర్ సిబ్బంది వివరాల మేరకు.. టంగుటూరు అరుంధతినగర్ చెందిన పసుమర్తి కోటేశ్వరరావు..చెప్పులు కుట్టుకుంటూ, అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధమైంది. ప్రమాదంలో రూ.లక్ష మేరకు ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్నిమాపక శాఖాధికారులు మంటలను అదుపు చేశారు.



ఎర్రవాగు చప్టా ఎక్కే వద్ద పడిన గుంతలు



చప్టా మధ్యలో పడిన గుంటలో ఇనుప చువ్వలు

ఆదమరిస్తే అంతే!

- ఎర్రవాగు చప్టాపై సిమెంట్ లేచి బయటపడిన చువ్వలు
- వాహనాలకు పడుతున్న పంక్చర్లు



చప్టాపై ఏర్పడిన పెద్ద గుంతలు

కందుకూరు రూరల్:

కందుకూరు నుంచి కొండముడుసుపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న ఎర్రవాగుపై చప్టా ప్రమాదకరంగా మారింది. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఎర్రవాగు ఉధృతంగా ప్రవహించింది. ఈ ప్రవాహనానికి చప్టాపై సిమెంట్ లేచిపోయి చువ్వలు బయటపడ్డాయి. పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంటలను గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డులో కందుకూరు నుంచి కొండముడుసుపాలెం, మోపాడు, మాచవరం, గుడ్లూరు, తెట్టు, కావలికి ఆర్టీసీ బస్సులు, ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాల రాకపోకలతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. వర్షాలు తగ్గి వారం అవుతున్నప్పటికీ చప్టాను పట్టించుకున్న నాథుడే కనిపించడం లేదు. నీటి ప్రవాహానికి చప్టాపై సిమెంట్ లేచిపోయి చువ్వలు బయటపడ్డాయి. వాహనదారులు ఆ గుంటను గమనించగా వేగంగా వెళ్తూ గుంతల్లో పడుతున్నారు. ఇనుప చువ్వలు బయటకు వచ్చి ఉండటంతో అవి గుచ్చుకొని వాహనాలు పంక్చర్లు అవుతున్నాయి. కందుకూరు నుంచి చప్టా ఎక్కేటప్పుడు తారు, మట్టి కొట్టుకుపోయి గుంట ఏర్పడింది. దీంతో చప్టాపై నుంచి దిగే వాహనాలకు ఆ గుంటలు కనిపించగా దగ్గరకు వచ్చేసరికి గమనించి ఆకస్మాత్తుగా బ్రేకులు వేసి అదుపు తప్పి పడిపోతున్నారు. అలాగే వాహనాలు నడిపితే గుంటల్లో పడి నడుములు గుల్లవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. వాహనాలకు కూడా మరమ్మతులకు గురవుతున్నాయి. ఎవరైనా నూతన వ్యక్తులు, ద్విచక్ర వాహనాలపై వేగంగా ప్రయాణిస్తూ గుంటలు గమనించకపోతే ప్రమాదబారిన పడినట్లే. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఎర్రవాగు చప్టా ఇంత అధ్వానంగా మారినా పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

ప్రభుత్వ దగాపై రైతులు పోరుబాట పట్టాలి



ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: అన్నదాతలను దగా చేసిన కూటమి ప్రభుత్వంపై రైతులు పోరుబాట పట్టాలని, ఈ ఉద్యమానికి వైఎస్సార్ సీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పార్టీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు. అన్నదాత సుఖీభవ అంటూ ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని ఒక్క రూపాయి కూడా రైతులకు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు అకాల వర్షాలు కురిసి అనేక ప్రాంతాల్లో నీట మునిగి ధాన్యం రంగుమారితే కొనుగోలు చేసే దిక్కు కూడా లేదని విమర్శించారు. , ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తామని చెప్పి దళారీలు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటుంటే కూటమి ప్రభుత్వం నిద్రపోతుందని ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంటల కొనుగోలు, ఈ క్రాప్ నమోదు, ఆర్‌బీకేల ద్వారా కొనుగోళ్లు, మద్దతు ధర కల్పన, రైతులకు పెట్టుబడి సాయం అందించడం ..అన్నింటిలోనూ అండగా ఉందన్నారు. చంద్రబాబు మోసాన్ని గుర్తించిన రైతులు పోరుబాటు సిద్ధమవుతున్నారని, వారి పోరుబాటకు వైఎస్సార్ సీపీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. రైతులకు అండగా జగనన్న పిలుపుమేరకు ఈనెల 13వ తేదీ అన్నదాతలు భారీగా తరలివచ్చి కలెక్టర్‌కు వినతి పత్రం అందించే కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పామూరు: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్‌మౌలాలి, మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. విద్యుత్‌చార్జీల పెంపును నిరసిస్తూ తక్షణం మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మౌలాలి, ప్రభాకర్‌లు మాట్లాడుతూ త్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వాటిని అదుపుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువత పడే కష్టాలు వర్ణనాతీతమని, విద్యావంతులకు ఉద్యోగాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని, లేకుంటే ఉద్యమాలను ఉధృతం చేసి ప్రభుత్వాలకు గుణపాఠం చెబుతామన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. సీపీఐ నియోజకవర్గ సహాయకార్యదర్శి వజ్రాల సుబ్బారావు, ఆర్.సూరిబాబు, రఘునాథరెడ్డి, ఇర్రి వెంకటరెడ్డి, ప్రసాదు, మహేష్, రమణయ్య, పలువురు సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

-డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



ప్రజావేదికను నిర్వహిస్తున్న, పీడీ జోసఫ్‌కుమార్

పొన్నలూరు: గ్రామాల్లో చేపట్టే ఉపాధి పనులను ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పారదర్శకంగా చేయించాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధిహామీ, పంచాయతీరాజ్, హౌసింగ్, పశుసంవర్ధకశాఖ, సెర్ప్, వాటర్‌షెడ్ శాఖలకు సంబంధించిన 734 పనులకు ఖర్చు చేసిన రూ.11.69 కోట్ల నిధులపై తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు, నిధుల ఖర్చుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఏడాది క్రితం తీసిన కుంటలు వర్షాలకు లోతు, వెడల్పులు మారిపోవడంతో కొలతల్లో తేడా వచ్చి రూ.3.54 లక్షల రికవరీకి ఆదేశాలు ఇచ్చారు. అలాగే చిన్న, చిన్న అవకతవకలకు పాల్పడిన 17 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అనంతరం పీడీ జోస్‌ఫ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా 500కు పైగా అభివృద్ధి పనులు చేపట్టవచ్చని, భవిష్యత్‌లో చేపట్టే ఉపాధి పనులు గ్రామాల అభివృద్ధికి దోహదపడేలా ఉండాలన్నారు. డీవీఓ జాన్సీరాణి, ఏపీడీ రాజారావు, ఏపీఓ మాచర్ల, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 157 అర్జీలు



రామచంద్రాపురం రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జనార్దన్



వీఆర్‌ఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తహసీల్దార్ రవి



దిరసమంచలలో మాట్లాడుతున్న తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి



దొడ్డిచింతలో రెవెన్యూ సదస్సులో అర్జీలు అందజేస్తున్న రైతులు

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 157 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టి.రవి తెలిపారు. వీటిలో రెవెన్యూకు సంబంధించినవి 36 అర్జీలు రాగా, మిగిలిన అర్జీలు 121 వచ్చినట్లు పేర్కొన్నారు. రేషన్‌కార్డుల కోసం 59, పింఛన్ల కోసం 48, ఇళ్ల స్థలాల కోసం 3, ఆధార్ సవరణకు ఒకటి, గృహనిర్మాణం కోసం 10 అర్జీలు వచ్చాయని వివరించారు.

వీఆర్‌ఓపై ఆగ్రహం..

వాస్తవానికి రెవెన్యూ సమస్యల కోసం గ్రామసభ ఏర్పాటు చేస్తే విఆర్‌ఓ వెంకటాద్రి రెవిన్యూ సమస్యలతో పాటు ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు, ఫించన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పటంతో ప్రజలు భారీగా తరలివచ్చారు. వీటికి సంబంధించి 121 అర్జీలు రావటంతో తహశీల్దార్ రవి అక్కడే ఉన్న వీఆర్‌ఓ వెంకటాద్రి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సమస్యలపై సదస్సులు నిర్వహిస్తుంటే..ఇతర సమస్యల కోసమని ఎలా చెప్తావని, దీని వల్ల సిబ్బందికి అదనపు పనిభారం తప్ప రెవెన్యూ సదస్సు ఉద్దేశం పక్కదారి పడుతుందని మందలించారు. రెవెన్యూ సదస్సుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు మాత్రమే అర్జీ రూపంలో ఇవ్వాలన్నారు. ఆర్ఐ ప్రసాద్, దేవదాయ శాఖ అధికారి పి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 23 అర్జీలు

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): మండలంలోని దిరిశమంచ గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 23 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సీహెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పాస్‌పుస్తకాల మ్యుటేషన్ల కోసం 22, ఇతర అర్జీలు ఒకటి వచ్చినట్లు పేర్కొన్నారు. అర్జీలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. పి.పురుషోత్తంరెడ్డి, డీటీ రవిశంకర్‌రెడ్డి, ఆర్ఐ లావణ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలోని దొడ్డిచింతలలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 17 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. భూమి ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని 16 అర్జీలు, భూమి కావాలని ఒక అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. డీటీ కె.కిషోర్‌రెడ్డి, మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, వీఆర్‌ఓ షబీర్, సర్పంచ్ బ్రహ్మారెడ్డి, కార్యదర్శి అశోక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గుమళ్లి(సింగరాయకొండ): మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సుకు 33 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బి.జనార్దన్ తెలిపారు. అర్జీలు అన్ని రెవిన్యూ సంబంధించనవేనని తెలిపారు. నోడల్ అధికారి యు భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని పెదరాజుపాలెం, నలజనంపాడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ప్రజల నుంచి 27 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ మంజునాథరెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ చేయాలని 23 అర్జీలు, పట్టాల కోసం నాలుగు అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. వీఆర్‌ఓ బి.మాల్యాద్రి, సర్వేయర్ సుప్రియ, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

కొండపి: చీమకుర్తిలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఏర్పడి 54 ఏళ్లవుతున్నా అభివృద్ధి అంతంతమాత్రమేనన్నారు. జిల్లాలో ఉన్న నదులు వాగులు వంకలు ఆధారంగా ప్రాజెక్టుల నిర్మాణం, చెక్‌డ్యాంల నిర్మాణం చేయాలన్నారు. జిల్లాలో లభించే గనులు, వనరులు ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, కనిగిరి నియోజకవర్గంలో నిమ్జ్, దొనకొండలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఎం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్, మండల కార్యదర్శి కొండయ్య, నాయకులు చిన్న పేతురు, బ్రహ్మయ్య, దావీదు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు: కందుకూరు
ఈ.పి.నెం.70/2017 - ఓ.ఎస్.నెం.145/2013
సూరిశెట్టి ప్రభాకరరావు ....డి.హెచ్.ఆర్.
వర్సెస్
భాస్కరుని వెంకట కృష్ణమూర్తి ...జె.డి.ఆర్.

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన శ్రీ సూరిశెట్టి ప్రభాకరరావు తనకు రావలసిన డిక్రీ బాలుకూ బాకీ వసూలు నిమిత్తం సదరు భాస్కరుని వెంకట కృష్ణమూర్తికి సంబంధించిన దిగువ ఉదహరించిన ఉమ్మడి కుటుంబ ఆస్తి నుండి అతనికి చెందినటువంటి 1/3వ భాగం ఆస్తిని వేలం జరిపించి సదరు వేలం ద్వారా నా క్లయింటు తన బాకీని వసూలు చేయుటకు కోర్టువారు అనుమతించియున్నారు. వేలం తేది.19-12-2024గా నిర్ణయించినారు. కావున పాటదారులెవరైనా ఉన్న యెడల ఆట్టి వారు వేలం తేది:19-12-2024గా ఉదయం 10.30 నిముషములకు పై కోర్టు నందు జరుపబడు వేలం నందు పాల్గొనవలసినదిగా ఇందుమూలంగా తెలియపరచడమైనది.

ఆస్తి వివరములు

పాకలగ్రామ పంచాయితీ, పాకల గ్రామము, సింగరాయకొండ మండలం. ప్రకాశం జిల్లా, సోరు నెం.404, విస్తీర్ణము య.0.10 సెంట్లు, స్వభావము: ఆర్.సి.సి. బిల్డింగ్ మరియు ఖాళీ స్థలమునకు హద్దులు: తూర్పు: దబ్బుగొట్టు రమణయ్య ఇల్లు, దక్షిణం: వడ్డమూడి క్రీష్టయ్య పశువులపాక, పడమర: రాజబాట, ఉత్తరం: 10 అడుగుల వరసంధు, ఈ హద్దుల లోని ఉన్నటువంటి ఆర్.సి.సి. బిల్డింగు మరియు ఖాళీ స్థలమునందు జె.డి.ఆర్.కు సంబంధించిన 1/3వ భాగము మాత్రమే.

// కోర్టు ఉత్తర్వుల మేరకు //

D.H.R. Value : Rs.2,66,667/-
Amina Value : Rs.3,25,000/-
Market Value : Rs.4,00,000/-
తేది :06-11-2024
స్థలం : కందుకూరు

కొమ్మన మల్లికార్జున రావు
డి.హెచ్.ఆర్. అడ్వకేట్, సింగరాయకొండ.

మానవ హక్కులపై అవగాహన అవసరం



ఏరువారిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు విద్యార్థులు



వెంకటాపురం కాలనీలో మాట్లాడుతున్న ఎంఈఓ కరుణకుమారి

పామూరు: మానవ హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ కె.కరుణకుమారి అన్నారు. మానవహక్కుల దినోత్సవాన్ని మండలంలోని వెంకటాపురం ఎస్సీకాలనీలో స్వయంకృషి స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి భావ ప్రకటన హక్కు ఉందన్నారు. హక్కుల వినియోగంలో ఎవరైనా ఇతరుల హక్కులకు భంగం కలుగకుండా ఉపయోగించుకోవాలన్నారు.

బడిఈడు పిల్లలంతా పాఠశాలలో ఉండాలి

బడిఈడు పిల్లలంతా పాఠశాలలకు వచ్చి విద్యాభ్యాసం చేయాలని ఎంఈఓ కరుణకుమారి అన్నారు. వె వెంకటాపురం ఎస్సీకాలనీలో ఐదుగురు డ్రాపౌట్స్‌ను గుర్తించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, మహిళాసంరక్షణ కార్యదర్శి షేక్.షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): మండల పరిధి ఏరువారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మంగళవారం హెచ్‌ఎం ముంతాజ్‌బేగం అధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించి హక్కులపై అవగాహనకల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ గతంలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగేవని, ప్రస్తుతం ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి పెట్టి పిల్లలను చదివిస్తున్నారన్నారు. బాల్య వివాహాలను ఎవ్వరూ ప్రోత్సహించకుండా పిల్లలను బాగా చదివించాలన్నారు. అనంతరం పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశరావు, హెచ్‌ఎం ముంతాజ్, సీడీపీఓ సరోజినీ, కార్యదర్శి రవికుమార్, డీపీపీపీఓ దినేష్ కుమార్, పారా లీగల్ వలంటీర్ రమేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురుగుమందుల వాడకం తగ్గించాలి

టంగుటూరు: పొగాకు రైతులు రసాయన పురుగు మందులు తగ్గించి బోర్డు సూచించిన మేరకే పురుగు మందులు వినియోగించాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఎం. నిడమానూరులో పొగాకులో సస్య రక్షణ చర్యలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర వ్యవసాయ పద్ధతులు, పురుగు మందుల యాజమాన్యం, పురుగుమందుల వాడకం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు, జీవ సంబంధిత పురుగు మందుల వాడకం, పురుగుమందుల అవశేషాలు నిర్మూలన, పొగాకులో తలతుంచి పిలక మందుల వాడకం వల్ల వచ్చే లాభాల గురించి వివరించారు. క్షేత్రాధికారి ఉపేంద్ర, ఐటీసీ మేనేజర్ వెంకట్రావు, జీపీఐ మేనేజర్ శ్రీనివాసరావు, రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా అయ్యప్ప అంబలిపూజ



అరటిబోదెలతో నిర్మించిన ప్రత్యేక మందిరం వద్ద పూజలుచేస్తున్న మాలధారులు

పామూరు: స్థానిక అయ్యప్ప ఆలయం వద్ద హరహరసుతుడు అయ్యప్ప అంబళిపూజ కార్యక్రమం మంగళవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయం వద్ద నుంచి అయ్యప్ప, విఘ్నేశ్వరుడు, సుబ్రమణ్యేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవిల పంచలోహ విగ్రహమూర్తులను 5 గుర్రాలపై ఉంచి అయ్యప్పమాల ధారులు పట్టణంలోని ప్రధానవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అంబళిపూజ సందర్భంగా అరటిబోదెలతో నిర్మించిన ప్రత్యేక మండపాలలో ఉత్సవం నిర్వహించిన దేవతా మూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెట్లపూజ నిర్వహించి పడిని వెలిగించారు. వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు, ఉపసర్పంచ్ యాదాల సాయికిరణ్ మాలధారులకు భిక్ష ఏర్పాటుచేశారు. దేవస్థాన గౌరవ అధ్యక్షుడు మణికంఠ సత్యనారాయణ, చైర్మన్ గుత్తి వెంకటరాజా, కావేటి సుబ్బయ్య, ఇర్రి కోటిరెడ్డి, బొమ్మన శ్రీనివాసులు, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి పలువురు ఉన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

సీఎస్‌పురం(పామూరు): మినుము, కందిపైర్లను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ ఏ వెంకటరమణ అన్నారు. మండలంలోని పెద్దగోగులపల్లి, అగ్రహారం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది ఏఓ బి.సంపత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఏఈఓ పి.శ్రీనివాసులు, వీఏఏ వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, చిరంజీవి, రైతులు ఉన్నారు.

పీసీపల్లి: మండల పరిధిలోని గుంటుపల్లి, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయాధికారి ప్రకాష్‌రావు పొలాలు పరిశీలించారు. కందిలో మారుకా మచ్చల పురుగు నివారణకు సూచనలు చేశారు. పంటల బీమా ప్రీమియం సకాలంలో చెల్లించాలని సూచించారు.

కొండపి: మండలంలోని పెట్లూరు, మూగచింతల గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ మిరపలో బొబ్బర తెగులు నివారణకు సూచనలు చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఐ.పద్మ, కె.వెంకటరావు, టి. వెంకటనారాయణ, రైతులు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): పొగాకు సాగులో మెళకువలు పాటించి తెగుళ్లను నివారించుకుని అధిక దిగుబడిని సాధించాలని ఏఓ పి.యుగంధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పంగులూరివారిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోందిలో ఆయన పాల్గొన్నారు.

టంగుటూరు: రైతులు తప్పనిసరిగా పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత అన్నారు. మండలంలోని వల్లూరు, సూరారెడ్డిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించి సూచనలు చేశారు.

మద్దిపూడి: మండలంలోని వేమవరం గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.